క్లుప్తంగా

హోమియో కళాశాల్లో పీజీ కోర్సులకు అనుమతులు

గుడివాడరూరల్: గుడివాడ డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాల్లో 2024–25 వార్షిక విద్యా సంవత్సరానికి గాను పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ జాతీయ హోమియో మండలి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ల కొరత, వసతులేమి, ఇతర కారణాలతో హోమియో కళాశాల్లో 24పీజీ కోర్సు సీట్లను కేంద్ర ప్రభుత్వం గతంలో నిలుపుదల చేసింది. సీట్ల రద్దు వలన తాము నష్టపోతున్నామంటూ విద్యార్థులు ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కలిసి కోర్సులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయుష్ కమిషనర్, ఢిల్లీలోని జాతీయ హోమియో మండలి అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే చేసిన కృషి ఫలితంగా ఎన్సీహెచ్ అధికారులు 2024–25 సంవత్సరాలకు పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పీర్ల ఊరేగింపు



పమిడిముక్కల: మండంలోని అలీనఖీపాలెంలో కర్బలా అమరవీరుల అర్బయిన్(40 రోజుల దినం) జరిపారు. రెండు మసీదుల ఆధ్వర్యంలో పీర్లను ఊరేగించి, చెస్ట్ బీటింగ్ నిర్వహించారు. పీర్ల ఊరేగింపులో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పాల్గొన్నారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏకీకృత్ పింఛన్ పథకం వద్దు

ముదినేపల్లి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏకీకృత్ పెన్షన్ స్కీం (యూపీఎస్) ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఏపీటీఎఫ్ నాయకులు అన్నారు. సంఘ సమావేశం ముదినేపల్లిలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) రాజకీయ సమస్యగా మారిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఓపీఎస్ కోసం పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం యూపీఎస్ ప్రవేశ పెట్టడం తగదన్నారు. తక్షణమే దీనిని ఉపసంహరించుకొని పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, కృపాకర్, వెంకటరత్నం, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



గుడివాడ టౌన్: స్థానిక కాపు సేవాసమితి సేవా కార్యక్రమాల్లో భాగంగా పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేసినట్టు సేవా సమితి అధ్యక్షుడు నరహరశెట్టి ప్రసాదు తెలిపారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో సేవా సమితి సభ్యుల సహకారంతో బరుగుల అజయ్ విద్యాభివృద్ధికి ఈ వితరణ అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాపు సేవా సమితి కార్యదర్శి ఎ.మల్లేశ్వరరావు, కోశాధికారి సీహెచ్‌వి. రామారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో నష్టం

మండవల్లి: మండలంలోని ఉనికిలిలో ఆదివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.2 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన గంజి నీలాంబరం ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. సోనీ ఎల్ఈడీ కలర్ టీవీ, ఫ్రిడ్జ్, దుస్తులు, సింగిల్‌కాట్ మంచం, సీలింగ్ ఫ్యాన్లు మొత్తం రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఇంటి యజమాని తెలిపారు.

పోలీసులు రక్షణ కల్పించాలి



కోల్‌కతా ఆస్పత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన దారుణం. ఆడపిల్లలు పని చేసే ప్రదేశాల్లో రాత్రి సమయంలో పటిష్ట భద్రత కల్పించాలి. ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసుల గస్తీ పెంచాలి. ఆడపిల్లలకు చిన్నతనం నుంచి మగవారి నుంచి ఎలా రక్షించుకోవాలో అవగాహన పెంచాలి.

– ఎన్.దివ్య, పీహెచ్‌సీ వైద్యురాలు, వెంట్రప్రగడ

వైద్యులకు భద్రత తప్పనిసరి



ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులకు భద్రత తప్పనిసరిగా కల్పించాలి. 24 గంటలు డ్యూటీ వల్ల రాత్రి వేళల్లో మద్యం తాగిన వాళ్లు, గొడవ పడిన కేసులు వస్తుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైద్యులకు రక్షణ కరువై దుర్ఘటనలు జరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. కోల్‌కతా ఘటన మహిళా వైద్యులకు ఎంతో ఆందోళన కలిగించింది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– సుధారాణి, వైద్యురాలు, పామర్రు సీహెచ్‌సీ

కృష్ణం వందే జగద్గురుం

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

కృష్ణాష్టమి వేడుకలను జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణాలయాలతో పాటు అన్ని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. పలు చోట్ల చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు.



మండవల్లిలో స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

మొవ్వ: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను సోమవారం మొవ్వ మండలంలో ఇంటింటా భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. నాట్యక్షేత్రం కూచిపూడిలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాజగోపాల స్వామి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను శాస్త్రయుక్తంగా జరిపారు. చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉట్టి కొట్టటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మొవ్వ, కారకంపాడు, కోసూరు, పెదముత్తేవి, నిడుమోలు గ్రామాల్లో వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి గ్రామోత్సవాలు నిర్వహించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గోపూజ

శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని సోమవారం మొవ్వలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో కూచిపూడి, మొవ్వ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ మొవ్వ ప్రెసిడెంట్ నంబూరు జగదీష్ కృష్ణ, కూచిపూడి వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ ఎండూరి జగన్మోహన్‌రావు, సెక్రటరీ అఖిల, ట్రెజరర్ పువ్వాడ వరలక్ష్మీ, పువ్వాడ సురేష్ పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక కృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు జరిగింది. చేబోయిన వీర్రాజు, బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, ఆగొల్లు గంగారావు, నల్లబోయిన రాజేష్, చెన్ను పండు, అజాద్ పాల్గొన్నారు.

అల్లినగరంలో..

మండవల్లి: మండలంలోని అల్లినగరంలోని రాజగోపాలస్వామి దేవస్థానంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి దివ్యశ్రీ పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనం గౌతమ్‌కుమార్ సోమవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక విష్ణాలయంలోని వేణుగోపాల స్వామికి కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయ మేనేజర్ కె వెంకట్రరెడ్డి, సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, భక్తులు ఆర్.గోపి, సురేంద్ర శర్మ పాల్గొన్నారు.

ఏఎస్ఎంలో..

స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ వేషధారణలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం గోపికల మధ్యన కృష్ణుడు ఉట్టి కొట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



గుడివాడలో శ్రీకృష్ణుని దర్శించుకుంటున్న భక్తులు

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

పమిడిముక్కల: మండలంలోని ఐనపూరు, కపిలేశ్వరపురం గ్రామాల్లో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఐనపూరులో ఆలయ కమిటీ తరపున ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని కృష్ణ మందిరం, కాకర్లవీధిలోని గీతా మందిరంలో పర్వదిన వేడుకలు నిర్వహించారు. కృష్ణమందిరంలో తొలుత గోపూజ చేశారు. భక్తులు వేకువజాము నుంచే ఆలయానికి వచ్చి శ్రీకృష్ణుని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.



పామర్రులో జరిగిన ఉట్టి మహోత్సవంలో గోపికలతో కృష్ణుడు

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, కృష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బాలురు, బాలికలు ఉత్సాహంతో శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఊరేగింపులో పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: కృష్ణాష్టమి పర్వదిన వేడుకలు పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, చినపారుపూడి, పాములపాడు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. వెంట్రప్రగడ ఎర్ర చెరువు సమీపంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టికొట్టే ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడక నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. కైకలూరులో శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘు కార్యాలయంలో అధ్యక్షుడు చేబోయిన వీరరాజు సభ్యులతో కలిసి శ్రీకృష్ణ విగ్రహానికి పూజలు చేయించారు. స్థానిక మీసాల వెంకన్న ఆలయంలో నియోజకవర్గ యాదవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణజన్మాష్టమి వ్రతం నిర్వహించారు. గంగుల అశోక్ దంపతులు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం, అనంతరం ఉట్టి కార్యక్రమం నిర్వహించారు. యాదవ సంఘ నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు, గురజాల రవి, బోయిన చంద్రశేఖర్, జాజుల రాజు, కిరణ్ బీకేఎం .నానీ, పూలా రాజీ, రామకృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అల్లినగరంలో రాజగోపాలస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



మొవ్వలో గోపూజ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



కూచిపూడిలో ఉట్టి కొడుతున్న బాలకృష్ణులు



ముదినేపల్లిలో కృష్ణాష్టమి సందర్భంగా ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి



పామర్రు: ప్రస్తుతం వాతావరణం ప్రతికూలంగా ఉన్నందున ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ స్థానిక వైద్యులను కోరారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. వైద్యశాలలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలో ఇన్‌పేషెంట్స్ ఎవరూ లేరని గుర్తించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ఈ తరుణంలో వైద్యశాలకు వచ్చిన రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించి ఆరోగ్యవంతులుగా మార్చాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, వైద్యురాలు సుధారాణి పాల్గొన్నారు.

కమ్మిలి అప్పారావు సేవలు చిరస్మరణీయం

కైకలూరు: నియోజకవర్గ అభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కమ్మిలి అప్పారావు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పెద్ద మసీదు సెంటర్‌లో ఆయన విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ రెండు పర్యాయాలు కైకలూరు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం ఎమ్మెల్సీగా అప్పారావు సేవలు అందించారన్నారు. ఆయన పాలనలో పెదఎడ్లగాడి, చిన ఎడ్లగాడి, ఉప్పుటేరు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టారన్నారు. అనేక గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అప్పారావు కల్పించారని కొనియాడారు. అనంతరం పేదలకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. అప్పారావు కుమారుడు మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు సతీమణి స్వర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, కేకే బాబు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి అద్దంకి వెంకటశ్రీనివాసరావు, నరహరిశెట్టి ఝాన్సీ, అన్నం రాంబాబు, తులసి పూర్ణచంద్రరావు, రామస్వామి, మెకానిక్ శివ, ప్రసాద్, శ్యామలరావు పాల్గొన్నారు.

మదర్‌థెరిసాకు ఘన నివాళులు



పామర్రులో మదర్‌థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

గుడివాడ టౌన్: సేవకు నిదర్శనం మదర్‌థెరిస్సా అని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో మదర్‌థెరిసా జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనం మదర్‌థెరిసా అని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణదొర, స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు ఎ.గోపిరెడ్డి, ఉపాధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కార్యదర్శి ఎస్. పద్మజ, కోశాధికారి చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

పామర్రులో..

పామర్రు: స్థానిక గుడివాడ రోడ్డులోని పామర్రు టౌన్, రూరల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో సోమవారం మదర్‌థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షులు సాల్మన్ కొల్లాబత్తుల థెరిస్సా సేవలను కొనియాడారు. అనంతరం పామర్రులో ఘంటసాల కళాపీఠం స్థాపించినప్పటి నుంచి సేవా కార్యక్రమాలను చేస్తున్న పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ చేస్తున్న సేవలను గుర్తించి వారికి సేవారత్న అవార్డును ఇచ్చి ఘనంగా సన్మానించారు.

ఘాటెక్కిన ఉల్లి ధర



గోదాములో ఉల్లిపాయలు

- కిలో రూ.60
- వినియోగదారుల ఆందోళన

గుడివాడ టౌన్: ప్రతిఒక్కరూ కూరల్లో వినియోగించే ఉల్లిపాయల ధర రోజురోజుకు పెరుగుతుండడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. నిల్వలు ఎన్నున్నా కృత్రిమ కొరతకు వ్యాపారులు సాకులు చెపుతూ ధర పెంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఆంధ్రప్రదేశ్ మొత్తానికి సరిపడా ఉల్లిపాయలు మహారాష్ట్ర నుంచి సరఫరా అవుతుంటాయి. అక్కడ వీటిని భద్రపర్చేందుకు అధునాతన వసతులతో కూడిన గిడ్డంగులు అందుబాటులో ఉంటాయి. సహజంగా ఉల్లిధర ఆగస్టు, సెప్టెంబర్‌లో కొంత పెరగడం సర్వసాధారణం అని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. అయితే ప్రస్తుతం ధర పెరగడానికి అనేక సాకులు చెబుతున్నారు. భారీగా వర్షాలు వచ్చి పంట నష్టపోవడంతో ధర పెరిగిందనడం హాస్యాస్పదంగా ఉందని స్థానికులు అంటున్నారు. 10 రోజుల క్రితం వర్షాలు వస్తే పాత ఉల్లిపాయ ధర ఎందుకు పెరగాలి అని ప్రశ్నిస్తున్నారు. గత ఏప్రిల్‌లో రూ.20కు ఇంటి వద్దకు వచ్చి అమ్మిన చిరు వ్యాపారులు కంటికి కనిపించడం లేదని మహిళలు చెబుతున్నారు. అప్పట్లో ధర పెరిగితే కేవలం కిలోకు రూ.2 లేదా రూ.3 వరకు పెరుగుతుండేది. ఇప్పుడు వాటి ధర విపరీతంగా పెరిగిపోయిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమాంతం పెరిగిన ధర

జూన్ మొదటి వారంలో రూ. 25 నుంచి రూ.30కు ఎగబాకిన ఉల్లి ధర అమాంతం పెరుగుతూ వస్తోంది. ఆగస్టు నెలాఖరుకు వచ్చేసరికి అది రూ. 60కు చేరడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గుడివాడ పట్టణం, పరిసర ప్రాంతాలకు ప్రతి రోజూ సగటున 10 టన్నుల ఉల్లిపాయలు వినియోగిస్తున్నారని హోల్‌సేల్ వర్తకులు తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులే చిన్న ఉల్లి రూ. 47, పెద్ద ఉల్లి రూ. 50 అమ్ముతున్నారని వాటికి కిరాయిలు, తరుగు వేసుకునే రూ.60కు విక్రయించినా గిట్టుబాటుకావడం లేదని రిటైల్ వ్యాపారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కేవలం దళారులు మాత్రమే లాభపడుతున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వాలకు మార్కెట్ నిల్వలు, సరుకు ఉత్పత్తి ఏ మేరకు ఎగుమతులు, దిగుమతులు అవుతున్న అంశాలపై పట్టులేకపోవడం, దృష్టి సారించకపోవడమే కారణం అని వినియోగదారులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉల్లి వ్యాపారులపై దృష్టి పెట్టి అక్రమ నిల్వలు మార్కెట్‌లోకి విడుదల చేసినప్పుడే సామాన్యుడికి ఉల్లి ధర అందుబాటులోకి వస్తుందని అంటున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సబ్సిడీలో ఉల్లిపాయలు అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ధరలు నియంత్రించాలి



ప్రతి ఏటా ఏదో ఒక కారణం చూపి ఉల్లి వ్యాపారులు ప్రజలను దోచుకుంటున్నారు. కొంతకాలం సాధారణ ధరలకు విక్రయించి, ధరను రోజులు తిరగకుండానే అమాంతం పెంచేస్తూ ప్రజలకు ఉల్లి ధర భారంగా మారుస్తున్నారు. ఒకవైపు హోల్‌సేల్ వ్యాపారుల వలన రైతు నష్టపోతుంటే దళారుల వలన వినియోగదారుడు నష్టపోతున్నారు. ఈ విధానంపై ప్రభుత్వం దృష్టిపెట్టి అన్ని వేళలా అందరికీ అందుబాటులో ఉండేలా ఉల్లి ధరలు నియంత్రించాలి.

– పి.రజిని, గుడివాడ ఐద్వా కార్యదర్శి

సబ్సిడీ కేంద్రాల్లో పంపిణీ చేయాలి



ప్రభుత్వం రూ.30కు సబ్సిడీపై విక్రయించే ఉల్లిపాయ కేంద్రాలు కేవలం రైతు బజారుకే పరిమితం కావడంతో అనేక మందికి సబ్సిడీ ఉల్లిపాయలు అందడంలేదు. పేదలు నివసించే ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేకించి టిడ్కో గృహాల సముదాయం వద్ద కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. వేలాది మంది ఇక్కడ నివసిస్తున్న నేపథ్యంలో రైతు బజారుకు రావడం కష్టంగా మారుతుంది.

– సయ్యద్ నూరున్నీసా, గుడివాడ

ఇరిగేషన్ భూముల కబ్జా

- పామర్రు డ్రెయిన్ గట్టుపై ఉన్న స్థలాలూ ఆక్రమణ
- స్థానికుల సమాచారంతో వెలుగులోకి



లస్కర్‌కు కేటాయించిన క్వార్టర్స్

పామర్రు: పామర్రు డ్రెయిన్ భూ అక్రమార్కుల చేతుల్లో పడి నలిగిపోయింది. మండలంలోని ఉరుటూరు గ్రామంలోని నాగులేరు కాలువ వంతెన వద్ద ప్రారంభమైన కాలువ పామర్రు గ్రామంలోని వీరాంజనేయపురం కాలనీ, కోటిరెడ్డి పేట, చల్లపల్లి రోడ్డు, అరండాల్ పేటలో ప్రవహిస్తుంది. మురుగును తీసుకొచ్చి పామర్రులోని నాగులేరు కాలువలో కలుస్తుంది. ఈ నేపథ్యంలో డ్రెయిన్ గట్టుపై ఉన్న ఇరిగేషన్ ఖాళీ స్థలాలను, లస్కర్‌కు కేటాయించిన క్వార్టర్స్‌ను అదే శాఖలో 16 ఏళ్లకు పైబడి పని చేస్తున్న నాగరాజు అనే లస్కర్ కొంత కాలం క్రితం తన ఆధీనంలోకి తీసుకుని, వాటిని అయిన కాడికి అమ్మేశాడు. అది తెలియని అమాయకులు ఆ స్థలాలను కొనుగోలు చేసి అక్కడే నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఇరిగేషన్ స్థలాలకు పంచాయతీ వారు ఇంటి పన్నులను ఏ విధంగా వేశారో అర్థం కావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా పామర్రు డ్రెయిన్ పూర్తిగా కుచించుకుపోయి డ్రెయిన్ ద్వారా మురుగు నీరు దిగువకు ప్రవహించే పరిస్థితి లేదు. దీని వలన అరండాల్ పేటలో కొద్ది పాటి వర్షానికే రహదారులు మురుగునీటితో నిండిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇరిగేషన్ స్థలంలో అక్రమ కట్టడం

చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఇరిగేషన్ శాఖ పరిధిలోని లస్కర్ స్థలాలను ఆక్రమించుకుని విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంతో సుమారు 20 సెంట్ల ఇరిగేషన్ స్థలం భూ కబ్జాకు గురైంది. పామర్రు డ్రెయిన్ పరిధిలో ఉన్న ఇరిగేషన్ ఆక్రమణలను సత్వరమే తొలగించి, డ్రెయిన్‌లో పూడికతీత పనులను చేపట్టాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించుకుని అమ్మేసినా సంబంధిత లస్కర్‌పై ఇరిగేషన్ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోందని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఉద్యోగి

పామర్రులో గత 16 ఏళ్ల పైడి లస్కర్‌గా విధులు నిర్వహించిన ఓ వ్యక్తి ప్రమోషన్‌పై కమలాపురం లాక్ సూపరింటెండెంట్‌గా వెళ్లారు. అక్కడి నుంచి కొన్ని కారణాలతో మళ్లీ పామర్రుకు ఐసీ అసిస్టెంట్‌గా వచ్చి పనిచేస్తున్నాడు. ఇక్కడే తనకు లాక్ సూపరింటెండెంట్ ఉద్యోగం కావాలంటూ ఇరిగేషన్ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. గతంలో పామర్రులో లస్కర్‌గా విధులు నిర్వహించిన సమయంలో ఈ ప్రబుద్ధుడు తాను ఆక్రమించిన ఇరిగేషన్ స్థలాలను అయిన కాడికి అమ్ముకున్నట్లు అతడిపై అభియోగం ఉంది. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈఈ విన్నకోట నాగవెంకట రామ్‌కుమార్‌ను వివరణ కోరగా పామర్రు చానల్ గట్లపై ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించామని, ఆక్రమణలను తొలగింపునకు ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించాలని పామర్రు రెవెన్యూ శాఖ వారిని కోరతామని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల నుంచి ఆదేశాలు రాగానే ఆక్రమణలపై రెవెన్యూ, పీఆర్, పోలీస్‌శాఖలతో కలిసి తగు విధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కుచించుకు పోయిన పామర్రు డ్రెయిన్

ముగిసిన పవిత్రోత్సవాలు



స్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం గోపూజ, గవ్యాంత పూజలు, మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలు, పవిత్ర జల సంప్రోక్షణ, పవిత్రాల సమర్పణ నిర్వహించారు. అనంతరం స్వామి జన్మ నక్షత్రమైన కృత్తికా నక్షత్రం సందర్భంగా శాంతి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో పలువురు దంపతులు పీటలపై కూర్చొని కల్యాణతంతు నిర్వహించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఈ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సహాయ కమిషనర్ నేల సంధ్య పర్యవేక్షించారు.